క్లుప్తంగా

పౌర గ్రంథాలయంలో క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు గురువారం గ్రంథాలయ సొసైటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ నిర్వహించారు. 70 మంది విద్యార్థులు గ్రూపులుగా పాల్గొన్నారు. సమకాలీన అంశాలు, చరిత్ర, జాతీయ ఉద్యమం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక, రాజనీతి, భూగోళ శాస్త్రాలు మొదలైన విషయాలపై 70 ప్రశ్నలు అడిగారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. విజేతలకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు.

సాయినగర్‌కు కొత్త కార్యవర్గం

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు సాయినగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన పాలక మండలి ఎన్నిక గురువారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.సాయిశంకర్ కుమార్, ఉపాధ్యక్షుడిగా వి.శ్యామ్, కార్యదర్శిగా బి.రాజేష్, కోశాధికారిగా ఎన్.గణేష్ ఎన్నికయ్యారు. వారంతా బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ సాయినగర్ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామన్నారు.

కూలిన వృక్షం.. తప్పిన ప్రమాదం



ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో కూలిన చెట్టు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఓ చెట్టు గురువారం కూలిపోయింది. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు అక్కడే కూర్చుంటారు. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే ఆ చెట్టును తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కారు అద్దాలు ధ్వంసం

● పోలీసులకు ఫిర్యాదు



కారు వెనుక డోర్ అద్దాలు పగిలిన దృశ్యం

సీతమ్మధార: పార్క్‌చేసి ఉన్న కారు అద్దాలను పగలగొట్టిన సంఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెంలో జరిగింది. వివరాలిలా.. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో అక్కయ్యపాలెంలో ఏపీ39టీపీ 0907 నంబర్ గల కారును డ్రైవర్ పార్క్‌చేశాడు. తెల్లవారుజామున అతడు చూసే సరికి కారు వెనుక అద్దాలు ధ్వంసమై ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఈ పని చేసి ఉంటారని భావించి.. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కారు డ్రైవర్ ఫిర్యాదు చేశాడు.

మజ్జిగ పంపిణీ



ఇందిరానగర్ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్–4, జవహర్‌లాల్ నగర్ కొండవాలు ప్రాంతాల్లో గ్రామ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం కార్పొరేటర్ గంకల కవిత ప్రారంభించారు. వేసవి దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, మహేష్, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎండాకాలం.. ఏర్పాట్లు శూన్యం!

● జీవీఎంసీ జోన్–5లో కానరాని గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు
● మండువేసవిలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కంచరపాలెం మెట్టు జంక్షన్ వద్ద పరిస్థితి



హైవేపై కప్పరాడ బస్టాప్ వద్ద చెట్ల నీడలో ప్రయాణికులు(ఫైల్)



ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో బస్టాప్ వద్ద కానరాని గ్రీన్ షెల్టర్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో ఈ ఏడాది గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాల జాడ కనిపించడం లేదు. వేసవి కాలం మొదలై జనంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నా.. వాటి ఏర్పాటు దిశగా జోనల్ అధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో మండుటెండలో ప్రయాణికులు, బాటసారులకు అటు నీడ.. ఇటు తాగునీరు కరువైంది. జోన్‌లో 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. వాటి పరిధిలోని బస్టాప్‌ల వద్ద గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలను ఇంకా ఏర్పాటు చేయలేదు. ఎండల తీవ్రత, వడగాల్పుల ప్రభావంతో అటు ప్రజలు.. ఇటు పాదచారులు విలవిల్లాడుతున్నారు. మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రస్తుతం స్వచ్ఛంద సంస్థలు, ఆయా కాలనీల కమిటీలు అక్కడక్కడా చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, తాగునీరు అందిస్తున్నాయి.

పట్టనట్లుగా అధికారులు..

జోన్ పరిధిలోని జ్ఞానాపురం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, కైలాపురం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, మద్రిపాలెం, కరాసా, ఎన్ఏడీ, బుచ్చిరాజుపాలెం, గోపాలపట్నం, ఎయిర్‌పోర్ట్, షీలానగర్, మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లోని బస్టాప్‌లకు ఆనుకుని గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సాధారణంగా వీటిని మేలో.. జోన్–5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాటు చేస్తుంటారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే వేసవి ప్రభావం తీవ్రంగా ఉన్నా.. అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. జాతీయ రహదారులు, బీఆర్‌టీఎస్ మార్గాలు, ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో బస్సుల కోసం గంటల కొద్దీ షెల్టర్లలో వేచి ఉండాల్సి వస్తోందని, ఆ సమయంలో ఎండలు, వడగాల్పులను తట్టుకునే పరిస్థితి లేదని ప్రయాణికులు వాపోతున్నారు. గ్రీన్ షెల్టర్ల ఏర్పాటుతో కాస్త ఉపశమనం దొరుకుతుందంటున్నారు. జోన్–5 పరిధి ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల్లో కనీసం 36 నుంచి 42 వరకు గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు అవసరం ఉంటుందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి మండువేసవిలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మండుటెండలో తప్పని అవస్థలు



ఎండల తీవ్రతకు సొమ్మసిల్లేలా వడగాల్పులు వీస్తున్నాయి. బస్టాప్‌ల్లో ఎదురెండ, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నాం. ఎండ ప్రభావంతో షెల్టర్‌లో కుర్చీలు, రాడ్లు వేడెక్కుతున్నాయి. బస్టాప్‌లను ఆనుకుని గ్రీన్ షెల్టర్లు ఏర్పాటు చేస్తే కాస్తా ఉపశమనం దొరుకుతుంది.

– ఈతలపాక ఈశ్వరరావు, కంచరపాలెం

అధికారులు చర్యలు చేపట్టాలి



ఎండ వేడి, వడగాల్పులతో రోడ్డుపై నడవాలంటేనే గొంతెండుతోంది. దాహంతో దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. బస్టాప్‌లు, ముఖ్యమైన ప్రదేశాల్లో గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నాయుడు, ఆశవానిపాలెం

గ్రీన్ షెల్టర్లు ఏర్పాటు చేస్తాం



ఎండల తీవ్రత దృష్ట్యా ముందుగానే గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాల ఏర్పాటుకు కావాల్సిన సామగ్రి కొనేందుకు అంచనా నిధులు మంజూరు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతలు ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించాం. ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించాం. మొదటి విడతగా అక్కడ గ్రీన్ షెల్టర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం. రెండో విడతలో మిగతా వాటిని ఏర్పాటు చేయించి జోన్ ప్రజలకు అందుబాటులో ఉంచుతాం. చలివేంద్రాల నిర్వహణకు స్వచ్ఛంద సేవా సంస్థలు సహకరించాలి.

– ఆర్.జి.వి.కృష్ణ, జోన్–5 కమిషనర్, జీవీఎంసీ

మాణిక్యాంబ కాలనీకి రహదారి సౌకర్యం



రహదారి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు

మురళీనగర్: ఐదు దశాబ్దాల కాలం నుంచి అరిష్కృతంగా ఉన్న మాణిక్యాంబ కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్టు జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు తెలిపారు. వార్డులోని మాణిక్యాంబ కాలనీలో రూ.3 లక్షలతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ మాణిక్యాంబ కాలనీలో కొంత భాగానికి ప్రధాన రహదారి లేకపోవడం వల్ల పాదచారులు, వాహన చోదకులు, ఆరోగ్య పరమైన సమస్యలతో బాధపడే వారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వ పాలకులకు స్థానిక ప్రజలు రోడ్డు నిర్మించాలని కోరినప్పటికీ పట్టించుకోలేదన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వ హయాంలో, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో ఈ కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నట్టు శంకరావు చెప్పారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామరాజు, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు బొట్ట శంకర్, కె.మున్నా, కె.కిశోర్, బి.భాస్కర్ పాల్గొన్నారు.

పాలిసెట్ ఉచిత శిక్షణకు విశేష స్పందన



విద్యార్థులకు గణితం బోధిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులకు విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 17న కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో పదో తరగతి విద్యార్థుల కోసం ఉచితంగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. బ్యాచీకి 60 మంది చొప్పున తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాల బోధనకు ప్రత్యేకంగా ఫ్యాకల్టీని నియమించారు. గైస్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ గణిత బోధన తరగతులు నిర్వహించడం విశేషం. శిక్షణ అనంతరం విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ ఇస్తారు.

నేత్రపర్వంగా ముత్యమాంబ పండగ



ప్రత్యేక అలంకరణలో ముత్యమాంబ అమ్మవారు

కంచరపాలెం: కంచరపాలెం మెట్టు కూడలిలో కొలువైన ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండగ గురువారం కనుల పండువగా జరిగింది. గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం గ్రామాధ్యక్షుడు భీశెట్టి వెంకటరావు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మకర తోరణం, వెండి కిరీటం, ఏడువారాల నగలతో అలంకరించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. వేకువజాము నుంచే కంచరపాలెం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు ముత్యమాంబను దర్శించుకుని, మొక్కులు సమర్పించుకున్నారు. వారికి ఉత్సవ నిర్వాహకులు మజ్జిగ, శీతల పానీయాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, ఎమ్మెల్యే పి.గణబాబు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టబంగారం వద్ద నుంచి అమ్మవారి ప్రతిమలను ఆలయం వద్దకు చేర్చారు. అనంతరం ప్రతిమల అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు భీశెట్టి వీరబాబు, పి.కె.వి.రమణ, పాలమరశెట్టి రాజు, రామకృష్ణ కాళ్ల రామారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ, విశాఖ డెయిరీ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు ముందు కొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవికాలం అంతా చలివేంద్రం నిర్వహిస్తారని అన్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి 100 నుంచి 200 మంది అర్జీదారులు వస్తారని, వారికి భోజనం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో కూడా చలివేంద్రం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విశాఖ డెయిరీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ ఎస్‌కేఎల్ రావు, విశాఖ డెయిరీ మార్కెటింగ్ మేనేజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర, వక్తృత్వ పోటీలు రేపు



వివరాలు వెల్లడిస్తున్న సంస్థ అధ్యక్షుడు వర్మ

సీతంపేట: ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఈ నెల 22న పాదయాత్ర, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎస్.ఆర్.వర్మ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్ నుంచి ఏయూ కన్వెన్షన్ హాల్ వరకు పాదయాత్ర, ఉదయం 8.30 గంటలకు ఏయూ సోషల్ అండ్ సైన్స్ డిపార్ట్‌మెంట్ నాగార్జున హాస్టల్ ఎదుట వక్తృత్వ పోటీలు జరుగుతాయన్నారు. డిగ్రీ విద్యార్థినీ విద్యార్థులకు నాలుగు విభాగాల్లో 'పక్షులు అంతరించిపోకుండా రక్షించడం', 'దేవాలయాల్లో పాలిథిన్ వాడకం–నిర్మూలన', 'మన భూమి–మన బాధ్యత'లో భాగంగా 'భావితరాల కోసం కాలుష్యాల నుంచి భూగ్రహాన్ని రక్షించడం–వాతావరణంలో మార్పులు', 'ఈ తరం ప్రజలకు సేంద్రియ వ్యవసాయం–చిరుధాన్యాలపై అవగాహన' వంటి అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు ఇస్తామన్నారు. నాలుగు విభాగాల్లో బహుమతులు సాధించిన విజేతలకు మళ్లీ వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6 వేలు అందజేస్తామని తెలిపారు. అదే రోజు సాయంత్రం ఏయూ కన్వెన్షన్ హాల్‌లో త్రిదండి చినజీయర్ స్వామి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. పాల్గొన దలచిన వారు 99898 19666, 73374 11732 నంబర్లలో సంప్రదించాలని వర్మ కోరారు. సమావేశంలో వికాస తరంగిణి కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి రామానుజం పాల్గొన్నారు.

కాలభైరవుడికి పూజలు



గుమ్మడి కాయలో భక్తులు వెలిగించిన నెయ్యి దీపాలు

సీతమ్మధార: అమావాస్య సందర్భంగా గురువారం కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో కొలువైన కాలభైరవుడికి ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం చేశారు. భక్తులు తమ స్వహస్తాలతో గుమ్మడి కాయలో నెయ్యి దీపాలు వెగించి భక్తిని చాటుకున్నారు. షిర్డీసాయికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ సిబ్బంది శివ, అర్చకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల బహూకరణ



విభాగాధిపతి వీర్రాజుకు పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్ సులేమాన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగానికి డాక్టర్ సులేమాన్ పలు పుస్తకాలను బహూకరించారు. విభాగ విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఉపయుక్తంగా రూ.3 వేలు విలువ చేసే పుస్తకాలను గురువారం విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజుకు అందజేశారు. డాక్టర్ సులేమాన్ విభాగంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. ఈయన భారత ప్రభుత్వంలో ఉన్నతోద్యోగిగా సేవలు అందించి పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం



14వ వార్డులో రక్తదానం చేస్తున్న యువకులు

సీతమ్మధార: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు 73వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి మేకసత్తి కిరణ్, అధ్యక్షుడు పీవీ వసంతరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 50 మంది రక్తదానం చేశారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ప్రధాన కార్యదర్శి రమణ, అవాల శ్రీనివాసరావు, వెల్లంకి కృష్ణ,తదితరులు పాల్గొన్నారు. 24వ వార్డు క్రాంతినగర్‌లో టీడీపీ వార్డు అధ్యక్షురాలు బర్ల పద్మావతి ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.

26వ వార్డులో..

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డులోని టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకల సందర్భంగా కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్‌చేశారు. 50 మంది యువత రక్తదానం చేశారు. మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాలనాయుడు, వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, కార్యదర్శి పి.లక్ష్మణ, వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజ్ సెక్రటరీ కొయిలాడ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భోజనం అందించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయబాబు, వార్డు అధ్యక్షులు కాళ్ల గౌరీ శంకర్‌నాయుడు, మళ్ల లక్ష్మి, అప్పాజీ, మోహనరావు, పుష్ప పాల్గొన్నారు.

అన్నదానం, చీరల వితరణ

మురళీనగర్: జీవీఎంసీ 50వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కేక్ కట్‌చేసి చంద్రబాబు జన్మదిన వేడుకలు ప్రారంభించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. పార్టీ నాయకులు ఎస్.రామచంద్రరావు, వై.ధాత్రి, ఎన్.సత్యనారాయణ, నాగన్న, ఎన్.నాగరాజు, అప్పలనాయుడు, అజయ్ కమల్, చక్రి, దాలినాయుడు, పి.గౌరి, త్రినాథ్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్లాట్‌ఫాం నంబర్–8లో వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్–8లో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా.. గురువారం ఉదయం 5.45 గంటల ప్రాంతంలో విశాఖ రైల్వేస్టేషన్ 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. ఏదో రైలు నుంచి జారిపడటం గానీ, లేదా రైలు ఎక్కుతున్న సమయంలో జారిపడటం వల్ల గానీ మరణించి ఉండవచ్చు. మృతుడి వయసు సుమారు 30–35 ఏళ్లు ఉంటుంది. ఇతడి వద్ద ఏవిధమైన ఆధారాలు లేవు. ఈ వ్యక్తి పసుపు, తెలుపు రంగు టీ షర్ట్, కాఫీ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మెడలో నలుపు రంగు తాడు, కుడిచేతి మీద నాగుపాము, ఓంకార గుర్తులు పచ్చబొట్లు ఉన్నాయి. ఈ మృతదేహం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ వద్ద స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో తెలియజేయాలని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.


పెనాల్టీల నుంచి ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి



బ్యాంకు చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట: బ్యాంకులు పెనాల్టీలు, చార్జీల నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు మినహాయింపు ఇవ్వాలని ఉద్యోగ సంఘాల కార్యాచరణ సమితి (అమరావతి) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన జరిగింది. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట జరిగిన ప్రదర్శనలో జేఏసీ చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ బ్యాంకులు విధించే పెనాల్టీల వల్ల ఉద్యోగుల సిబిల్ స్కోరు తగ్గిపోతుందని, దీని నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చి, అదనపు భారాన్ని తొలగించాలని కోరారు. అనంతరం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ రమేష్, కోశాధికారి రవిశంకర్, జేఏసీ కో చైర్మన్ నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుడు త్రిమూర్తులు దుర్మరణం



త్రిమూర్తులు(ఫైల్)

బీచ్ రోడ్డు: ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి పడిపోవడంతో ఉమ్మడి విశాఖ జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు జంగ త్రిమూర్తులు(56) దుర్మరణం చెందారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. పెదగదిలిలో నివాసం ఉంటున్న త్రిమూర్తులు ఏయూలో ఉద్యోగం చేస్తున్నారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మీదుగా మద్దిలపాలెం వైపు వస్తుండగా అదుపు తప్పి రోడ్డు మీద పడిపోయారు. తలకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఆయన మృతిపట్ల దళిత నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

సీపీని కలిసిన విష్ణుకుమార్‌రాజు



సీపీ త్రివిక్రమ్ వర్మను సత్కరిస్తున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మను తన చాంబర్‌లో గురువారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కొద్ది సేపు చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, పరశురామరాజు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ సంస్థలో రూ.9.05 లక్షల చోరీ

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి శంకరమఠం రోడ్డులో గల రామకృష్ణా నగర్‌లోని రియల్ ఎస్టేట్ సంస్థలో రూ.9.05 లక్షల నగదు చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రామకృష్ణా నగర్‌లో ఎస్ఎస్ రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని బండారు రవి, నాయుడు కలిసి కొద్ది రోజుల కిందట ప్రారంభించారు. వీరిద్దరూ సంస్థ లావాదేవీలు చూస్తుండేవారు. ఈ నెల 17వ తేదీ రాత్రి సంస్థ డెస్క్‌లో రూ.9 లక్షల 5 వేలు ఉంచి యథావిధిగా ఇంటికి వెళ్లిపోయారు. 18వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో రవి, నాయుడు డెస్క్‌లో పెట్టిన డబ్బులను చూడగా.. కనిపించలేదు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారమిచ్చారు. పోలీసులు కార్యాలయానికి వెళ్లి పరిశీలించారు. 19వ తేదీన ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈస్ట్ క్రైం సీఐ ఎర్రం నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఖగేశ్వరారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డెస్క్‌లో పెట్టిన నగదు సంస్థలో పని చేసిన సూర్యనారాయణ దొంగిలించినట్లు పోలీసుల విచారణలో తెలింది. అప్పటికే ఆ నగదుతో టీవీతోపాటు ఫ్రిజ్ కొనుగోలు చేసినట్లు గుర్తించిన పోలీసులు.. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ కేసులో అనుమానితుడిగా గుర్తించిన సూర్యనారాయణ కుటుంబ సభ్యులను క్రైం పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్టేషన్ వద్దే ఉంచడంతో వారిలో ఓ మహిళ స్పృహ తప్పి అక్కడ పడిపోయింది. ఈ ఘటన బయటకు రాకుండా వెంటనే పోలీసులు ఆమెను ఆటో ఎక్కించి ఇంటికి పంపించేశారు.